సాక్షి వికారాబాద్

మంగళవారం । 9 । జూలై । 2024



మండల విద్యాధికారులేరి!

విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తామని ప్రభుత్వం నిత్యం చెబుతున్నా.. ఆచరణలో అది సాధ్యం కావడంలేదు. 10లో▸



చిలకవాగు సర్వే షురూ..

కోకట్ శివారు నుంచి తాండూరు పట్టణంలోకి ప్రవేశిస్తున్న చిలకవాగు నాలా సర్వేకు అధికారులు శ్రీకారం చుట్టారు. 10లో▸



‘ఉపాధి’లో పండ్ల తోటలు

పండ్ల తోటల పెంపకానికి కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహాన్ని అందిస్తోంది. 11లో▸

న్యూస్‌రీల్

సీఎం రేవంత్‌ను కలిసిన గిరిజన నాయకులు



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న సంతోష్‌నాయక్, మోత్యానాయక్

బొంరాస్‌పేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మండల గిరిజన నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. సంతోష్‌నాయక్, మాజీ సర్పంచ్ మోత్యానాయక్ తదితరులు సీఎంను కలిసి గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని కోరారు. అలాగే బాపల్లి భూ సమస్య, పాలబాయి తండాకు బీటీ రోడ్డు వేయాలని విన్నవించారు.

12న తలనీలాల సేకరణకు వేలం

అనంతగిరి: అనంతగిరి గుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో తల నీలాల సేకరణకు ఈ నెల 12న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో నరేందర్, ట్రస్టీ పద్మనాభం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హక్కు వచ్చే ఏడాది జూలై 15వ తేదీ వరకు వర్తిస్తుందన్నారు. ఉదయం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు రూ.10 వేలు డిపాజిట్ చేసి పాల్గొనవచ్చని తెలిపారు. హక్కు పొందని వారికి డిపాజిట్ వాపసు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కౌలు వేలం మళ్లీ వాయిదా

- రైతులు వచ్చినా పాట నిర్వహించని అధికారులు
- కొంత మందే వచ్చారని సాకు
- 15న మరోసారి నిర్వహిస్తామని వెల్లడి




వేలం నిర్వహించకపోవడంతో ఖాళీగా కూర్చున్న రైతులు

దోమ: మండలంలోని దొంగ ఎన్కేపల్లిలో శ్రీ సంజీవ స్వామి ఆలయ భూముల కౌలు వేలం మళ్లీ వాయిదా పడింది. పది మంది రైతులు వేలంలో పాల్గొనడానికి వచ్చారు. అయితే ఎక్కువ మంది రాలేదనే సాకుతో అధికారులు వేలం నిర్వహించకుండానే వాయిదా వేశారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము వచ్చినా వేలం నిర్వహించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. గత మంగళవారం ఆలయ భూముల కౌలుకు వేలం నిర్వహించగా గతంలో కంటే తక్కువ ధరకు పాట పాడటంతో వేలాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. సోమవారం ఆలయ ఈఓ సుధాకర్, ఎండోమెంట్ అధికారుల ఆధ్వర్యంలో మరోసారి వేలం నిర్వహించేందుకు వచ్చారు. ఈ సారి రైతులు లేరన్న సాకుతో వేలాన్ని ఈ నెల 15వ తేదీకి వాయిదా వేశారు. దొంగ ఎన్కేపల్లిలోని సంజీవస్వామి ఆలయానికి 104 ఎకరాల 19 గుంటల భూమి ఉంది. రెండేళ్ల క్రితం గూడూర్ సర్వే నంబర్ 66, 135, 173, 174లో గల 46 ఎకరాల 03 గుంటల భూమిని కౌలుకు ఇచ్చారు. గడువు ముగియడంతో ఆ భూములకు వేలం నిర్వహించాలని భావించారు.

కావాలనే వేలం నిర్వహించ లేదు: రైతులు

అధికారులు కావాలనే ఆలయ భూముల కౌలు వేలం నిర్వహించలేదని రైతులు ఆరోపించారు. గత మంగళవారం వేలం పాడిన వారికే భూములు ఇచ్చేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 15వ తేదీ మరో సారి వేలం నిర్వహించే వేలంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొనాలని వారు కోరారు.

ఇబ్రహీంపట్నం కోర్టు ఏజీపీగా వాణి



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం కోర్టు ఏజీపీ(అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా న్యాయవాది దండె వాణి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఏజీపీగా తన వాదనలు బలంగా వినిపించేందుకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా కమిటీ చైర్మన్ వెదిరే వేణుగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

లేవీ.. ఏవీ ?

సీఎంఆర్ సేకరణలో తీవ్ర జాప్యం

- గతేడాది వానాకాలం బియ్యం 44శాతం మిల్లర్ల వద్దే
- గత యాసంగికి సంబంధించి వచ్చింది 32శాతమే



మిల్లర్ల నుంచి సేకరించిన బియ్యం

వికారాబాద్: లేవీ బియ్యం సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ విషయంలో అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సీఎంఆర్‌లో భాగంగా పౌరసరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయిస్తూ వస్తున్నారు. మిల్లుల యజమానులు సకాలంలో లేవీ బియ్యం ఇవ్వడం లేదు. దీంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. 2022 – 23 వానాకాలం సీజన్‌కు సంబంధించి పౌరసరఫరాల శాఖకు మిల్లర్లు ఇవ్వాల్సిన లేవీ బియ్యం నేటికీ పూర్తి కాలేదు. గత ఏడాది యాసంగి బియ్యం 23శాతం మాత్రమే సేకరించారు. మిల్లర్ల వద్ద ఉన్న మిగతా బియ్యాన్ని ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయించింది. ఇక గతేడాది 2023 – 24 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించిన లేవీ బియ్యం (సీఎంఆర్) ఇంకా 50 శాతానికి పైగా మిల్లర్ల వద్దే ఉండి పోయింది. దీన్ని బట్టి చూస్తే పౌరసరఫరాల శాఖ అధికారుల పనితీరు ఇట్టే అర్థమవుతుంది. ఇదే సమయంలో రైస్ మిల్లర్ల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

గతేడాది వచ్చింది 56శాతమే

లేవీ బియ్యం సేకరణలో అధికారులు ఎంతలా వెనకబడి పోయారో ఈ గణాంకాలను చూస్తే ఇట్టే అర్థం అవుతుంది. 2022 – 23 వానాకాలం సీజన్‌లో మిల్లర్లకు కేటాయించిన ధాన్యానికి సంబంధించి రావాల్సిన బియ్యంలో ఇప్పటి వరకు ఇంకా 4,889 మెట్రిక్ టన్నులు మిల్లర్ల వద్దే ఉండి పోయింది. 2022 – 23కు సంబంధించి 4,4528 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. మిల్లర్లకు ఎన్ని నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో వారి వద్ద ఉన్న ధాన్యాన్ని వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది వానాకాలానికి సంబంధించి మిల్లర్లకు ఇచ్చిన వడ్లలో 4,4251 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు 29,658 మెట్రిక్ టన్నుల బియ్యం ఇచ్చారు. ఇంకా 16,559 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉంది. గత రబీ సీజన్‌కు సంబంధించి 13,696 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా 9,313 మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారు. ఇంకా 3,016 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉంది.

మిల్లర్లతో కుమ్మక్కు

రైస్ మిల్లర్లతో సివిల్ సప్లై అధికారులు కుమ్మక్కు కావడం వల్లే వారి నుంచి సీఎంఆర్ రైస్ సకాలంలో అందడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఓ పక్క గడువులోగా లేవీ రైస్ సేకరించాలని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా.. అధికారులు మాత్రం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. గతంలో కొనుగోలు కేంద్రాల వద్ద స్థలం లేకపోవడంతో ధాన్యాన్ని మిల్లులకు తరలించారు.ఇదే అదనుగా భావించిన మిల్లు యజమానులు రైతుల నుంచి క్వింటాలు వడ్లకు ఆరు నుంచి పది కిలోల తరుగు రూపంలో కోత విధించారు. దీంతో అన్నదాతలు మిల్లుల వద్ద ఆందోళన కూడా చేపట్టారు.ఇంత జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

పలువురికి ఫైన్ వేశాం



తాము మిల్లర్లకు అందజేసిన వడ్లకు సంబంధించిన సీఎంఆర్ బియ్యాన్ని సాధ్యమైనంత త్వరగా సేకరిస్తాం. గతంలో గడువు ముగిసినా సీఎంఆర్ ఇవ్వని మిల్లర్లకు ఫైన్ వేశాం. గడిచిన రబీకి సంబంధించి ఎవరైతే మిల్లర్లు డీ ఫాల్టర్లుగా ఉన్నారో వారికి ధాన్యం సరఫరా చేయలేదు.

– సుగుణాబాయి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అప్రమత్తంగా ఉండండి

- సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: సీజనల్ వ్యాధులు డెంగీ, మలేరియా ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పరిశుభ్రతను పాటించడంతోపాటు తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. గురుకుల పాఠశాలలు, వసతి గృహాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. వర్షపు నీరు, మురుగు నిలవకుండా చూడాలన్నారు. ప్రజలు వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఏఎన్‌ఎంలు తరచూ వసతి గృహాలు, పాఠశాలలను సందర్శించాలని ఆదేశించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్, ఆయిల్ బాల్స్ వేయాలని మున్సిపల్,పంచాయతీల ప్రత్యేక అధికారులకు సూచించారు.ప్రైవేటు విద్యాసంస్థలు కూడా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఆ దిశగా ఉత్తర్వులు జారీ చేయాలని డీఈవో రేణుకాదేవికి సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, వైద్య ఆరోగ్య శాఖ అదనపు డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పల్వాన్ కుమార్, డీఈఓ రేణుకాదేవి,ఎస్సీ, బీసీ, మైనార్టీ శాఖల అధికారులు మల్లేష్, ఉపేందర్, హనుమంత రావు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ప్రజావాణికి 122 అర్జీలు

ప్రజావాణి అర్జీలను తక్షణం పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. ప్రతి సోమవారం మండల, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు కలెక్టరేట్ కార్యాలయానికి రావాల్సిన పని ఉండదని, అక్కడి అధికారులకు తమ సమస్యలను విన్నవించవచ్చని తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో విద్య, వైద్య, బీసీ, గిరిజన సంక్షేమం, విద్యుత్, పంచాయతీ, పింఛన్లు, మున్సిపాలిటీ, ధరణి, మైన్స్, భూ సర్వే తదితర వాటికి సంబంధించి 122 అర్జీలు వచ్చాయి. వీటితోపాటు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సుధీర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసు చంద్ర, వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



పాత కొడంగల్ శివారులో ఇంటిగ్రేటెడ్ గురుకులాల కోసం పరిశీలించిన ప్రభుత్వ భూమి

కొడంగల్‌లో ‘ఇంటిగ్రేటెడ్’

- సీఎం నియోజకవర్గంలో ఒకేచోట గురుకులాలు, హాస్టళ్లు
- పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక
- త్వరలో ప్రారంభం కానున్న పనులు

కొడంగల్: నియోజకవర్గ కేంద్రమైన కొడంగల్‌లో గురుకుల ఇంటిగ్రేటెడ్ క్యాంపస్ ఏర్పాటు కానుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలను ఒకేచోట ఏర్పాటు చేయనున్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ క్యాంపస్‌లకు సీఎం రేవంత్ సర్కార్ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. తెలంగాణలో రెండు చోట్ల పైలట్ ప్రాజెక్టుగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. సీఎం నియోజకవర్గమైన కొడంగల్‌లో ఒకటి, ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గమైన మధిరలో మరొకటి ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్ శివారులో కొత్త భవనాలను నిర్మిస్తారు. సాంఘిక సంక్షేమ శాఖ, మైనార్టీ వెల్ఫేర్ గురుకులాలకు అధునాతన వసతులతో కొత్త భవనాలు మంజూరు చేశారు. మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల నూతన భవనానికి రూ.20 కోట్లు మంజూరు చేశారు. దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మంజూరు చేశారు. ఒక్కో కళాశాల భవన నిర్మాణం, మౌలిక సదుపాయాల కోసం రూ.7.13 కోట్ల చొప్పున రూ.14.26కోట్లు మంజూరు చేశారు. కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలగా మార్చారు. భవనాలు, అభివృద్ధి పనుల కోసం రూ.30 కోట్లు మంజూరు చేశారు. కోస్గికి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. భవన నిర్మాణం, మౌలిక వసతుల కోసం రూ.11 కోట్లు కేటాయించారు. పలు పాఠశాలల భవనాల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేశారు.

వృత్తి నైపుణ్య విశ్వ విద్యాలయం మంజూరు

కొడంగల్ నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వృత్తి నైపుణ్య విశ్వ విద్యాలయాన్ని మంజూరు చేశారు. కొడంగల్, బొంరాస్‌పేట మండలాల్లో అవసరమైన స్థలాలను పరిశీలించారు. కొడంగల్ మున్సిపల్ పరిధిలోని బూల్కాపూర్ గ్రామ శివారులో, అలాగే బొంరాస్‌పేట మండలంలోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. వీటిలో ఏదో ఒకచోట వృత్తి నైపుణ్య విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయనున్నారు.

గురునాథ్‌రెడ్డి నియామకంపై హర్షం



కొడంగల్: రాష్ట్ర పోలీస్ హౌసింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం సోమవారం జీవో విడుదల చేసింది. గురునాథ్‌రెడ్డి నియామకంపై అభిమానులు. పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 11న ఆయన ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో గురునాథ్‌రెడ్డి స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సీనియర్ నాయకునిగా పేరుగాంచారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 1978, 1983లో వరుసగా విజయం సాధించారు. 1985లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. దీంతో హ్యాట్రిక్ మిస్సయ్యింది. మరో సారి 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో ఆయన గెలిచారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయారు. ఇలా రెండో సారి ఆయనకు హ్యాట్రిక్ తప్పింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గంలో గురునాథ్‌రెడ్డికి ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్ర పోలీస్ గృహ నిర్మాణ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమించారు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

రూ.500 కోట్లతో పర్యాటక అభివృద్ధి

- వికారాబాద్ రూపురేఖలు మారుస్తాం
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- పదవీ కాలం ముగిసిన మండల పరిషత్ సభ్యులకు సన్మానం



మండల పరిషత్ మాజీ పాలకవర్గాన్ని సన్మానించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్


ధారూరు: జిల్లాలో పర్యాటక ప్రాంతంగా విరాజిల్లుతున్న అనంత గిరులను రూ.500 కోట్లతో అభివృద్ధి చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ధారూరులోని శుభం ఫంక్షన్ హాల్‌లో సోమవారం మండల పరిషత్ పాలకవర్గం వీడ్కోలు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనంతగిరి కొండలను అభివృద్ధి చేసి అన్ని రాష్ట్రాల నుంచి పర్యాటకులు వచ్చేలా చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో జిల్లా నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. అభివృద్ధిని పరుగులు పెట్టించి వికారాబాద్ నియోజకవర్గ రూపురేఖలు మారుస్తామని పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు రూ.450 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 30 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. ఎన్నికల హామీలో భాగంగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 50 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, వారికి ప్రైవేట్ సెక్టార్లలో ఉద్యోగాలు కల్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్ రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించి అప్పులే మిగిల్చిందని ఆరోపించారు. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆరు గ్యారంటీలను ఆరు నెలల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో స్థానిక సంస్థలు బలోపేతం అవుతాయని అన్నారు. ధారూరును మోడల్ మండలంగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. జిల్లాలోని కోట్‌పల్లి, సర్పన్‌పల్లి లక్నాపూర్, శివసాగర్ తదితర ప్రాజెక్టుల అభివృద్ధికి కొత్త ఏజెన్సీని నియమించినట్లు తెలిపారు. కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి రూ. 110 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఎకో టూరిజం ద్వారా ప్రాజెక్టు సమీప అడవిలో చెట్ల కూల్చకుండా చూస్తామన్నారు. అనంతరం పదవీ కాలం ముగిసిన మండల పరిషత్ పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జె.విజయలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు సుజాత, రాములు, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓను బురిడీ కొట్టించి.. ఆపై పోలీసులకు చిక్కి



పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు, ఫోన్లు

- గత నెల 18న ఏసీబీ అధికారులమంటూ బెదిరింపు ఫోన్ కాల్
- రూ.5 లక్షలు కాజేసిన నిందితులు
- జూన్ 20న తాండూరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు
- ఇద్దరి అరెస్ట్, పరారీలో ప్రధాన నిందితుడు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ బాలకృష్ణారెడ్డి



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు టౌన్: ఏసీబీ అధికారులమంటూ ఎంపీడీఓను బెదిరించి రూ.5 లక్షలు కాజేసిన కేసులో తాండూరు పట్టణ పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం డీఎస్పీ బాలకృష్ణారెడ్డి విలేకరులకు వెల్లడించారు. తాండూరు పట్టణం ముత్యాల గల్లీకి చెందిన బండి లక్ష్మప్ప సిద్దిపేట జిల్లా బెజ్జంకి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్నారు. గత నెల 18న తాండూరుకు వచ్చారు. ఆ సమయంలో ఏసీబీ అధికారులమంటూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేశారు. నీపై ఏసీబీకి ఫిర్యాదు వచ్చిందని, పూర్తి సమాచారం మా వద్ద ఉందని బెదిరించారు. రూ.5 లక్షలు ఇస్తే కేసు ఉండదని చెప్పారు. ఐదు వేర్వేరు బ్యాంకు ఖాతా నంబర్లు ఇచ్చి నగదు ట్రాన్స్‌ఫర్ చేయాలన్నారు. భయాందోళనకు గురైన లక్ష్మప్ప తనకు తెలిసిన వారి వద్ద నుంచి గూగుల్ పే, ఫోన్ పే ద్వారా నిందితులు చెప్పిన ఖాతాల్లోకి నగదు జమ చేశారు. ఆ తర్వాత అనుమానం వచ్చి జూన్ 20న తాండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు అనంతపురం జిల్లా కొట్టాలపల్లికి చెందిన నూతేటి జయకృష్ణ, కర్ణాటక రాష్ట్రం చిక్‌బల్లాపూర్‌కు చెందిన తరుణ్ గౌడ్, ఆర్టీసీ మెకానిక్ ముజాహిద్ పాషాను నిందితులుగా గుర్తించారు. తరుణ్ గౌడ్, ముజాహిద్ పాషాను మహబూబ్‌నగర్ బస్టాండు వద్ద సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. లక్ష నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారి జయకృష్ణ అలియాస్ జయసింహ పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. ఇతనిపై ఏపీలో 31 కేసులు, తెలంగాణలో 3 కేసులు ఉన్నట్లు చెప్పారు. శంషాబాద్, సిద్దిపేటలోనూ ఏసీబీ అధికారులమంటూ మోసం చేసినట్లు తెలిపారు. కేసును ఛేదించిన హెడ్ కానిస్టేబుల్ అప్జద్, కానిస్టేబుళ్లు శివ, షబీల్, సాయప్ప, మహేష్‌కు నగదు బహుమతి అందజేశారు. సీఐ సంతోష్ కుమార్, ఎస్సై కాశీనాథ్‌ను అభినందించారు.

క్లుప్తంగా

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం



పట్టుబడిన గుట్కా ప్యాకెట్లు

తాండూరు టౌన్: నిషేధిత గుట్కా ప్యాకెట్లను ఓ ఇంట్లో స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కాశీనాథ్ సోమవారం తెలిపారు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన నాగరాజు ఇంట్లో గుట్కా ప్యాకెట్లు నిల్వ ఉన్నట్లు సమాచారం అందిందని, ఈ మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. వీటి విలువ రూ.80వేలు ఉంటుందని పేర్కొన్నారు. నాగరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

వ్యక్తికి జైలు శిక్ష

పరిగి: ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తికి పరిగి జూనియర్ సివిల్ కోర్టు జైలు శిక్ష విధించింది. వివరాల ఇలా ఉన్నాయి. మండల పరిధి సయ్యాద్‌మల్కాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి అంజయ్యకు 2012లో ఆబ్కారీ శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని.. యాబాజిగూడ గ్రామానికి చెందిన శేఖర్ రూ.1.5లక్షలు తీసుకున్నాడు. నాటి ప్రభుత్వం ఎక్సైజ్ కానిస్టేబుల్ పరీక్షలు నిర్వహించి, ఫలితాలు విడుదల చేసింది. దీంట్లో అంజయ్య పేరు రాకపోవడంతో శేఖర్‌ను అడగగా.. రెండు నెలలు ఓపిక పట్టు వస్తుందని సమాధానం దాటవేశాడు. అయినా ఉద్యోగం రాకపోడంతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేస్తానని శేఖర్ అంజయ్యకు చెప్పాడు. కానీ ఏళ్లు గడిచినా ఇవ్వకపోవడంతో పెద్ద సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినా శేఖర్ డబ్బులు ఇవ్వలేదు. దీంతో 2017 అక్టోబర్16న పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు వాదోపవాదనలు విన్న తరువాత జడ్జీ నాగుల శిల్ప.. మోసం చేసిన శేఖర్‌కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమాన విధించారు.

ఫార్మాసిటీనే రద్దు చేశాం..

- భూములెందుకు లాక్కుంటాం
- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి



యాచారం: 'జీవకోటికి ప్రాణహాని కలిగించే ఫార్మాసిటీనే రద్దు చేశాం. మళ్లీ పరిశ్రమలు పేరుతో రైతుల భూములు లాక్కుంటామా' అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముత్యాల వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఫార్మాసిటీ రద్దు కాదు, సేకరించిన భూముల్లో మళ్లీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తారని, అథారిటీలో జమ చేసిన భూములను లాక్కుంటారని భయాందోళన చెందవద్దని ఆయన రైతులను కోరారు. కొందరు కావాలనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఇదే విషయమై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి హామీ ఇచ్చారని ముత్యాల పేర్కొన్నారు. త్వరలో ఫార్మాసిటీపై ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సమీక్షించి, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తుందని హామీఇచ్చారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు చోరీ

షాబాద్: మహిళ మెడలో నుంచి పుస్తెల తాడును అపహరించిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి ఎల్గొడంగూడ గ్రామానికి చెందిన కుమ్మరి చిల్కమ్మ సోమవారం ఉదయం 11.40 గంటలకు కోడలు భాగ్యలక్ష్మితో కలిసి వ్యవసాయ పొలానికి వెళ్తోంది. ఈ క్రమంలో ఎదురుగా ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు చిల్కమ్మ మెడలో ఉన్న 3 తులాల బంగారు పుస్తెలతాడు చోరీ చేశారు. తాడును గట్టిగా లాగడంతో ఆమెకు గాయాలయ్యాయి. కుడిచెవికి ఉన్న బంగారు చెవికమ్మను లాగగా చెవితెగి కిందపడింది. ఆమె కోడలు దుండగులను పట్టుకునేందుకు యత్నించగా.. బైక్‌పై ఉడాయించారు. అనంతరం చిల్కమ్మ ఫిర్యాదు మేరకు.. పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మండల విద్యాధికారులేరి!

- జిల్లాలో ఒకే ఒక్క రెగ్యులర్ ఎంఈఓ
- సీనియర్ హెచ్ఎంలకు అదనపు బాధ్యతలు
- ఒక్కొక్కరికి రెండు, మూడు మండలాల కేటాయింపు
- పాఠశాలలపై కొరవడిన పర్యవేక్షణ



మండల విద్యావనరుల కేంద్రం

పరిగి: విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తామని ప్రభుత్వం నిత్యం చెబుతున్నా.. ఆచరణలో అది సాధ్యం కావడంలేదు. గత ప్రభుత్వం మనఊరు–మనబడి పేరిట, ప్రస్తుత ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో బడుల్లో అభివృద్ధి పనులు చేపట్టింది. మరోవైపు బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు బడిబాట కార్యక్రమం నిర్వహించింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. సంబంధిత అధికారుల పాఠశాలల పర్యవేక్షణ కొరవడటంతో నిర్వహణ గాడి తప్పుతోంది.

నియామకాలు నిల్..

కార్పొరేట్‌కు దీటుగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దుతామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నా.. మండల విద్యాశాఖ అధికారులను నియమించలేని పరిస్థితి నెలకొంది. 2015లో ఇన్‌చార్జి ఎంఈఓలను తీసుకున్నా.. ఆ తర్వాత అదనపు బాధ్యతలు కూడా ఇవ్వలేదు. దీంతో ఎంఈఓల నియామకం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాల పునర్విభజన తర్వాత ఏర్పడిన కొత్త మండలాలకు ఎంఈఓలను నియమించలేదు. మరో వైపు పాత మండలాల ఇన్‌చార్జి ఎంఈఓలు ఇటీవల జరిగిన హెచ్ఎంల బదిలీలలో ఇతర జిల్లాలకు వెళ్లిపోయారు. దీంతో మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పర్యవేక్షణ తలకు మించిన భారంగా మారుతోంది.

'పది'లో వెనుకబాటు

జిల్లాలో ఉన్న 20మండలాలకు 20మంది ఎంఈఓలు ఉండాలి. కానీ జిల్లా వ్యాప్తంగా కేవలం ఒకే ఒక్క దోమ ఎంఈఓ మాత్రమే రెగ్యులర్ ఉన్నారు. మిగతా మండలాల్లో హెచ్ఎంలకు ఇన్‌చార్జి ఎంఈఓలుగా.. పక్క మండలాల్లో అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో పనిభారం పెరిగి.. అటు ఎంఈఓకు, ఇటు పాఠశాలలకు సమన్యాయం చేయలేకపోతున్నామని పలువురు ప్రధానోపాధ్యాయులు వాపోతున్నారు. పూర్తి స్థాయి బాధ్యతలు లేక మండలంలోని పాఠశాలల పర్యవేక్షణ కరువై ప్రభుత్వ బడులు దీనస్థితిలో ఉన్నాయి. విద్యావ్యవస్థ దెబ్బతింటోంది. ఐదు సంవత్సరాలతో పోల్చి చూస్తే.. ఏటా సర్కారు బడుల్లో విద్యనభ్యసించే వారి సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. 2023–24 విద్యా సంవత్సర పది పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా చివరి స్థానంలో ఉంది.

ఏకీకృత సర్వీస్ రూల్స్‌తోనే సమస్యలు

రాష్ట్రంలో ఏకీకృత సర్వీస్‌రూల్స్ అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉండటంతో ఎంఈఓల నియామకాలు నిలిచిపోయాయి. జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలలు కలిపి 2000 సంవత్సరంలో జీహెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్లకు ఎంఈఓలుగా పదోన్నతులు కల్పిస్తూ బదిలీలు చేశారు. దీనిపై ప్రభుత్వ పాఠశాలల వారు కోర్టును ఆశ్రయించారు. ఇద్దరిని కలపొద్దని, వారు ఒప్పుకుంటేనే పదోన్నతులు ఇవ్వాలని కోర్టు తీర్పునిచ్చింది. అప్పటి నుంచి ఎంఈఓల నియామకం పెండింగ్‌లో ఉంది. అలాగే 2005 నుంచి రెగ్యులర్ ఎంఈఓలకు బదిలీలు లేకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదోన్నతులు, బదిలీలకు ఎలాంటి సంబంధం లేకపోయినా.. ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను అడ్డుపెట్టి బదిలీలు నిలిపివేస్తున్నారని ఎంఈఓలు వాపోతున్నారు. ఏకీకృత పరిష్కారమైతేనే మండల విద్యాధికారులను నియమించే అవకాశం ఉంది. అందుకే సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఇన్‌చార్జి ఎంఈఓలుగా ప్రభుత్వం నియమించింది.

చిలకవాగు సర్వే షురూ

- హద్దులు ఏర్పాటు చేసిన అధికారులు
- సర్వే సరిగా లేదు.. మరోసారి చేయాలి
- స్థానికుల డిమాండ్



సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

తాండూరు టౌన్: కోకట్ శివారు నుంచి తాండూరు పట్టణంలోకి ప్రవేశిస్తున్న చిలకవాగు నాలా సర్వేకు సంబంధిత అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సోమవారం పనులు ప్రారంభించారు. వాగు కబ్జాతో పట్టణంలోని పలు వార్డులు వరదనీటి బారిన పడుతున్నాయని, నిబంధనల ప్రకారం నాలాపై ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఇటీవల అధికారులను ఆదేశించి విషయం విధితమే. దీంతో ఇరిగేషన్ డీఈఈ కిష్టయ్య, యాలాల మండల సర్వేయర్ మహేశ్, ఆర్ఐ నారాయణ రెడ్డి తదితరులు చిలకవాగు నాలా ప్రవాహ మార్గాన్ని సర్వే చేసి, హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్వేయర్ మాట్లాడారు. కోకట్ పరిధిలోని సర్వే నంబర్లు 36,39,41,47,48,52,53,57,58,59, 62,63ల గుండా వాగు నాలా ప్రధాన మార్గం ఉందని పేర్కొన్నారు. కోకట్ శివారు నాలా మార్గం సర్వే 36తో ముగుస్తుందని, ఆ తర్వాత పట్టణ పరిధి సాయిపూర్ ప్రాంతంలోకి వెళ్తుందని వివరించారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నట్లు వెల్లడించారు.

తప్పుల తడక మార్గం



ప్లాట్లు, భవనాల మీదుగా వాగు నాలా మార్గాన్ని నిర్ధయించిన అధికారులు

అధికారులు చూపిన నాలా మార్గం తప్పుల తడకగా ఉందని సాయిపూర్ శివారు 48,49 సర్వే నంబర్ వాసులు ఆరోపించారు. గతంలో హైదరాబాద్ రోడ్డు మార్గంలోని హాది పెట్రోల్ పంపు ఎదురు గుండా నాలా ప్రవహిస్తూ పట్టణ పరిధిలోకి ప్రవేశించేదని తెలిపారు. అయితే నాలా మార్గాన్ని పూర్తిగా మార్చి తమ ప్లాట్లు, ఇళ్ల మీదుగా హద్దులు ఏర్పాటు చేయడం సరికాదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పదేళ్ల క్రితం తాము ఇక్కడ ప్లాట్లు కొనుగోలు చేశామని, అప్పట్లో ఇక్కడ ఎలాంటి నాలా లేదని పలువురు వెల్లడించారు. అధికారులు స్పందించి తిరిగి సర్వే చేయాలని డిమాండ్ చేశారు.

మరపురాని మహానేత వైఎస్సార్

పీసీసీ మైనార్టీసెల్ రాష్ట్ర కన్వీనర్ రియాజ్



తట్టెపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

పెద్దేముల్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేదల గుండెల్లో చిరస్మరణీయుడుగా నిలిచారని పీసీసీ మైనార్టీసెల్ రాష్ట్ర కన్వీనర్ రియాజ్ రియాజ్ అన్నారు. వైఎస్ జయంతి సందర్భంగా సోమవారం మండల పరిధి తట్టెపల్లి, అడ్కిచెర్లతో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. మరపురాని మహానేత వైఎస్ఆర్ అని, పేదల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు. రాజన్న రాజ్యంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని, వైఎస్ బాటల్లో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయబోతుందని తెలిపారు. ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఘనత వారికే దక్కిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు శంకర్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ నారాయణగౌడ్, తట్టెపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింలు, ఉప సర్పంచ్ కిష్టప్ప, ఎపీఎస్ డైరెక్టర్ హన్మంతు, జగన్, ఇమ్రాన్ పటేల్, సజిత్, ఎర్రవల్లి బిచ్చప్ప, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్లు తాగి వస్తుండగా..

కుప్పకూలి వ్యక్తి మృతి



అంజిలప్ప(ఫైల్)

తాండూరు రూరల్: కల్లు తాగి నడుచుకుంటు వెళ్తున్న వ్యక్తి కుప్పకూలి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధి జినుగుర్తి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, మతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జినుగుర్తికి చెందిన కొత్తపేట అంజిలప్ప(58) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అంజిలప్పకు కల్లుతాగే అలవాటు ఉంది. రోజులాగే సోమవారం ఉదయం గ్రామంలోని కల్లు దుకాణంలో కల్లు సేవించాడు. ఇంటికి వెళ్తున్న క్రమంలో అస్వస్థతకు గురై పడిపోయాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అంజిలప్పను ఇంటికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య శాంతమ్మ ఫిర్యాదు మేరకు కరన్‌కోట్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించి, అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా జినుగుర్తితో పాటు పరిసర ప్రాంత గ్రామా ల్లో కల్తీ కల్లు విక్రయాలు జోరుగా సాగుతున్నాయని మాజీ ఎంపీపీ రాంలింగారెడ్డి ఆరోపించారు. ఎక్సైజ్ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే దుస్థితి నెలకొందని మండిపడ్డారు.

చికిత్స పొందుతూ..

అత్తాపూర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు ఉరివేసుకున్న ఘటనలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అత్తాపూర్ పోలీసులు తెలిపిన ప్రకారం.. బాబానగర్ ప్రాంతానికి చెందిన సర్ఫరాజ్ (20) కూలీ. ఇటీవల అతని తండ్రి షేక్ హలీం మృతి చెందడంతో కుటుంబ భారం సర్ఫరాజ్‌పై పడింది. రోజూ పని దొరకకపోవడంతో ఇల్లు గడవడం ఇబ్బందిగా మారింది.దీంతో మానసిక వేదనకు గురైన సర్ఫరాజ్ ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించాడు. పోస్టుమార్టం అనంతరం సోమవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలం



సమావేశంలో మాట్లాడుతున్న మండల అభివద్ధి అధికారి సంధ్య

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి

- మండల అధికారి సంధ్య

మొయినాబాద్ రూరల్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మండల అధికారి సంధ్య అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఆరోగ్య వైద్య అధికారి డాక్టర్ వాణి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జీపీ కార్యదర్శులు, ఏఎన్ఎంలకు డెంగీ, మలేరియా వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా మండల అభివద్ధి అధికారి సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డిలు మాట్లాడారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య కార్మికులతో చెత్త చెదారం, మురుగు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు తొలగింప చేయాలని చెప్పారు. దోమల నివారణకు మందు పిచికారీ చేయించాలన్నారు. ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ వాణి మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఇందుకు గ్రామాల్లో ఏఎన్ఎంలు ప్రొటోకాల్ పాటించాలని సూచించారు. ఇంటింటికీ తిరుగుతూ ఎవరికైనా జలుబు, దగ్గు ఉన్నట్లుగా గుర్తిస్తే తగిన జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో మండల ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి



కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏలు

- వీఆర్ఏ వారసులకు ఉద్యోగ భద్రత కల్పించండి
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన సంఘం నాయకులు

అనంతగిరి: 61 సంవత్సరాలు పై బడిన వీఆర్ఏల వారసులకు కారుణ్య నియామకాలు చేపట్టి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు కలెక్టరేట్ ఎదుట వీఆర్ఏ వారసుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు పి.శ్రీకాంత్ మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న 20,555 మంది వీఆర్ఏలకు జీఓ 81,85 ద్వారా కారుణ్య నియామకాలు చేపట్టి, వారి అర్హతను బట్టి 16,758 మందికి వారసత్వ ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తుచేశారు. అనంతరం జీఓ పై కోర్టు స్టే విధించడంతో నియామకాలు నిలిచిపోయాయని తెలిపారు.

స్టే ఎత్తివేసినా స్పందించని ప్రభుత్వం

2023, నవంబర్ 21న హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వుల ప్రకారం జీఓ 81 పై స్టే ఎత్తివేసిందని తెలిపారు. స్టే ఎత్తివేసినా ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నియామకాలు చేపట్టలేదన్నారు. దీంతో 61 సంవత్సరాలు పై బడిన వారు రాష్ట్రంలో 3,797 మంది ఉన్నారని, వయస్సుకు మించి ఆయా కార్యాలయాల్లో సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. నియామక ఉత్తర్వులు ప్రభుత్వం చేపట్టకపోవడంతో వీఆర్ఏలు, వారి వారసులు తీవ్ర మనోవేధనకు గురవుతున్నారని, దీంతో 17 మంది చనిపోయారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి వారి వయసును దృష్టిలో ఉంచుకుని వీఆర్ఏల వారసులకు కారుణ్య నిమామకాల ద్వారా ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అంజయ్య, జనార్దన్, శ్రీనివాస్, రాజు, శేఖర్, యాదయ్య, సంగమేశ్వర్, నర్సింలు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిని ఉరితీయాలి



ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయీ బ్రాహ్మణులు

ఇబ్రహీంపట్నం: చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి ఉరిశిక్ష వేయాలని నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్ల బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజుకు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడారు. ఎనిమిదేళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 50 ఏళ్ల నర్సింహ.. చాక్లెట్ ఆశ చూపి లైంగిక దాడికి ఒడిగట్టడం చాలా దారుణమన్నారు. ఇలాంటి నిందితులను ఉరితీయాలన్నారు. బాధిత బాలికకు ఉచితంగా మెరుగైన చికిత్స అందించి, ప్రభుత్వ సంరక్షణలో ఉంచుకోవాలని కోరారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి, నియోజకవర్గ అధ్యక్షుడు మంఖాల ఉదయ్‌కుమార్, వెంకటేశ్, నర్సింహ్మ, ఎం.శ్రీనివాస్, అనిల్‌కుమార్, కిరణ్, అశోక్, ప్రవీణ్, యాదగిరి, సత్తయ్యలు పాల్గొన్నారు.

అబద్ధాలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్

- హామీలు నెరవేర్చని ప్రభుత్వం
- బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

వికారాబాద్: అమలు సాధ్యం కాని హామీలతో, అబద్ధపు మాటలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. ఇప్పుడు ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తుందని బీఆర్ఎస్ చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జి కార్తీక్‌రెడ్డి ఆరోపించారు. నవాబుపేట మండల కేంద్రంలో సోమవారం ఆ పార్టీ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అయినా ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. అమలు కానీ హామీలతో అధికారంలోకి వచ్చి, దేవుళ్ల మీద ఒట్లు వేయడమే తప్పా, అమలు చేసినా పాపాన పోవడం ఎద్దేవా చేశారు. ఇక నుంచి ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ.. ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య పార్టీ మారినా నియోజకవర్గంలో ఆయన వెంట ఒక్కరు పోలేదని తెలిపారు. కేవలం స్వార్థ ప్రయోజనాల కోసమే ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వెళ్తున్నారని పేర్కొన్నారు.

పెట్టుబడి సాయం ఘనత కేసీఆర్‌దే

దేశంలో ఎక్కడ లేని పథకాలు అమలు చేసిన ఘనత కేవలం ఒక్క కేసీఆర్‌కే దక్కిందని, రైతులకు పెట్టుబడి సహాయం చేసిన నాయకుడు అని కార్తీక్‌రెడ్డి స్పష్టంచేశారు. కేసీఆర్ నాయకత్వంపై నమ్మకంతోనే నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడలేదన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస సత్తా చూపుతామని వెల్లడించారు. పోలీసులు గులాబీ నాయకులపై తప్పుడు కేసులు పెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మాజీ వెజ్‌బోర్డు చైర్మన్ నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు భరత్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, ప్రకాశం, పుర్షోత్తం, సయ్యద్‌గౌస్, శాంతకుమార్, మహేశ్వర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, నరెందర్‌రెడ్డి ఉన్నారు.

జల్సాలకు అలవాటు పడి.. ఇళ్లల్లో చోరీ

- పట్టుబడిన నిందితులు, రిమాండ్‌కు తరలింపు



స్వాధీనం చేసుకున్న సొత్తును చూపిస్తున్న పోలీసులు

మీర్‌పేట: జల్సాలకు అలవాటు పడిన ఆ నలుగురు.. సులువుగా డబ్బులు సంపాదించాలని దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నారు. ఈ క్రమంలో ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కారు. సోమవారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, డీఐ గౌరినాయుడు తెలిపిన వివరాలు ప్రకారం.. ఉప్పల్‌కు చెందిన ఆటో డ్రైవర్ వల్లెపు జితేందర్(20), సెంట్రింగ్ పనిచేసే రాపోలు చందు(21), లేబర్‌గా పనిచేసే రాపోలు శ్రీశైలంతో పాటు ఓ బాలుడు నలుగురు కలిసి జల్సాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నారు. వీరిలో జితేందర్, చందు, మైనర్ వీరు ముగ్గురు పాత నేరస్తులే. ఈ నెల 1వ తేదీన బడంగ్‌పేట మారుతీనగర్‌లోని రమేష్ ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 125 గ్రాముల బంగారం, 450 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో క్రైం సిబ్బంది నాగరాజు, ఎల్లయ్య, శివరాజ్, విజయ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌రాజ్, నవీన్, ప్రకాశ్, రాజారెడ్డిలు ఉన్నారు.